క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంఈఓగా నాగభూషణరావు



నాగభూషణరావు

జియ్యమ్మవలస: మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఎస్.నాగభూషణరావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈఓగా పని చేసిన విమలకుమారి సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు.

సూపరింటెండెంట్‌కు ఎంపీడీఓ బాధ్యతలు



వెంకటరమణ

వీరఘట్టం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వై.వెంకటరమణకు ఎంపీడీఓ బాధ్యతలు అప్పగిస్తూ శ్రీకాకుళం జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎ.ప్రభాకరరావు అనారోగ్యం కారణంగా సెలవులో ఉండడంతో పరిపాలనా పరమైన సమస్యలు తలెత్తకుండా ఆయనకు ఎంపీడీఓగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ



పదో తరగతి పరీక్షలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ బి.నవ్య సూచించారు. గురువారం మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆమె పరిశీలించారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని, వేసవి నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

త్వరితగతిన హద్దు రాళ్ల ఏర్పాటు



అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ: భూముల రీసర్వే జరిగిన ప్రాంతాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు త్వరితగతిన చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశమైన ఆయన ఇంతవరకు గ్రామాల్లో జరిగిన సర్వేపై సమీక్షించారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని, హద్దు రాళ్ల ఏర్పాటు కూడా వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీ బుచ్చయ్య, మండల సర్వేయర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

పాలకొండ: ప్రతిఒక్కరూ సన్మార్గంలో పయనించి, ప్రపంచ శాంతిసామరస్యానికి తోడ్పాటునందించాలని ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. గురువారం మండలంలోని పనుకువలస గ్రామంలోని షిర్డీసాయి మందిరంలో జరిగిన దివ్యజ్ఞాన సత్సంగ సమావేశంలో పాల్గొన్న ఆయన అందరూ భగవన్నామస్మరణ చేయాలని కోరారు. ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని, ప్రతిరోజూ భగవంతుని పూజించాలన్నారు. సాటి వారిపై ప్రేమాభిమానాలు చూపించాలని తద్వారా మోక్షమార్గం పొందవచ్చన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పాలకొండ రూరల్: స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, సీ–బుక్‌లు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.



వీరఘట్టం: నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లీలాప్రసాదరావు, వైద్యారోగ్య సిబ్బంది



జియ్యమ్మవలస: చినమేరంగిలో అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పాలకొండ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యసేవలు అందిస్తున్న అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్



పాలకొండ రూరల్: బెజ్జిలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, వైద్యాధికారి చిరంజీవి



భామిని: పెద్దదిమిలిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీను, బాలేరు వైద్యాధికారి శివకుమార్



సీతంపేట: ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య



పాలకొండ: సింగన్నవలసలో ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్స్ ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రతి ఇంటికీ వైద్యం

సామాన్యుల ఆరోగ్యవరప్రదాయని ఫ్యామిలీ డాక్టర్ పథకం అమల్లోకి వచ్చింది. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, లింగంగుట్ల గ్రామం వేదికగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇదే కార్యక్రమం బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో కూడా ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆరంభమైంది. దీంతో ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందనున్నాయి. దీర్ఘకాల వ్యాధులు, మంచానపడిన రోగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్న హర్షం సర్వత్రా వ్యక్తమవుతోంది.

–సాక్షి నెట్‌వర్క్

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

–ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి తెలిపారు. మండలంలోని తాళ్లడుమ్మ గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు, పాలనలో తీసుకువస్తున్న సంస్కరణలతో దేశంలోనే అత్యుత్తమ ముఖ్యమంత్రిగా కితాబులందుకుంటున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని నేతలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఏ ఒక్క సమస్య పరిష్కారానికైనా సచివాలయం గడప తొక్కితే చాలని, క్షణాల్లో సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించి, అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు శశికళ, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, నేతలు అల్లు ఈశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

కురుపాం: గృహనిర్మాణ శాఖ(కురుపాం)లో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాలూరు రాధాకృష్ణ(54) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు గురువారం శివ్వన్నపేటలో వర్క్ఇన్‌స్పెక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు ఉన్నారు.

డీఎల్‌డీఓ సందర్శన



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

కురుపాం: మండల కేంద్రంలోని సచివాలయం–1, సచివాలయం–2లను డీఎల్‌డీఓ గోపాలకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. అలాగే ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

కృత్యాధార బోధనతో విద్యాసామర్థ్యాలు మెరుగు



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: కృత్యాధార బోధన ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగుపరచవచ్చని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. గురువారం మండలంలోని సంతోషపురం పంచాయతీ, ఖడ్గవలస గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు గమనించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గెడ్డ దగ్గర సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, అతడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ గురువారం తెలిపారు. సారా తరలించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

సీతంపేట: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని హడ్డుబంగి గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని గురువారం పరిశీలించిన ఆయన చెత్త సేకరణ, చెత్త నుంచి ఎరువుల తయారీపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో తాగునీటి వనరులు ఉండేలా చూడాలన్నారు. ఆ తర్వాత ఇంటి పన్ను వసూలులో సీతంపేట శతశాతం వసూలు చేయడంపై సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత



ఆస్పత్రిలో వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ఉమాపరమేశ్వరి

భామిని: అనారోగ్యం కారణంగా శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతునన మండలంలోని నేరడి–బి గ్రామానికి చెందిన వృద్ధుడు నగిరికటకం పకీరు వద్దకు వలంటీర్ పి.ఉమాపరమేశ్వరి వెళ్లి, గురువారం పెన్షన్ అందజేశారు. ఈ మేరకు సదరు వలంటీర్ సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ఏనుగుల బెడద లేకుండా చర్యలు తీసుకోండి



ఏనుగుల బెడదను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేత సింహాచలం, తహసీల్దార్ అప్పారావు

• వైఎస్సార్ సీపీ నేత తోట సింహాచలం

భామిని: రైతులకు ఏనుగుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు తోట సింహాచలం, బత్తిలి సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహు కోరారు. ఇదే విషయమై వారు మండలంలోని కాట్రగడ–బి ప్రాంతంలో వేసిన సర్వే రాళ్ల పరిశీలనకు గురువారం విచ్చేసిన పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి వారి ప్రాంతంలో ఏనుగుల బీభత్సం కారణంగా రైతులు పడుతున్న ఇక్కట్లు వివరించారు. పక్కుడుబద్ర వద్ద తిష్టవేసిన ఆరు ఏనుగుల గుంపు తరచూ రైతుల పంటలు ధ్వంసం చేస్తున్నాయని, దీంతో వారంతా అప్పులపాలవుతున్నారని తెలిపారు. ఏనుగుల భయంతో పంట ఎలా ఉందో చూడటానికి పొలానికి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఏనుగులు ఏయే ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని, ఎక్కడెక్కడ పంటలు నాశనం చేస్తున్నాయో తహసీల్దార్ అప్పారావు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన సబ్‌కలెక్టర్ ఏనుగుల సంచారం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన

భామిని: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే వేసవి నేపథ్యంలో ప్రతీ పరీక్ష కేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అప్పారావు ఉన్నారు.



పదో తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

పక్కాగా 'పది' పరీక్షల నిర్వహణ

• జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ

వీరఘట్టం: పక్కాగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రభుత్వ బాలురు, బాలికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను గురువారం పరిశీలించిన ఆయన విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పరీక్షలు జరుగుతున్న తీరు, కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. వేసవి నేపథ్యంలో విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. గురువారం నాటి హిందీ పరీక్షకు 735 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి డీఈఓకు తెలిపారు.

నేడు శివ్వన్నపేటలో 'మా నమ్మకం నువ్వే జగన్'

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పాల్గొంటారని, నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

• ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: ఎన్నికలకు ముందు, ఎన్నికల పుడు, ఎన్నికల తర్వాత ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం తమదేనని కురుపాం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని చినమేరంగి గ్రామంలో ఉన్న తన స్వగృహంలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. ఎక్కడా ఇంతవరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారని, సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన ఇంకెన్నో హామీలు నెరవేర్చారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతీ వర్గానికి మేలు జరిగేలా ఆయన కార్యక్రమాలు రూపొందించి, అమలుచేస్తున్నారన్నారు. ఏప్రిల్ ఏడో తేదీ నుంచి జరిగే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జయప్రదం చేయాలని, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, జియ్యమ్మవలస మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, మండల సచివాలయ కన్వీనర్ పల్ల అనంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.